క్లుప్తంగా

సిరులతల్లికి తులసిపూజ



పూజలందుకున్న కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ. 1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. కార్యక్రమంలో ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

12న హనుమాన్ శోభా యాత్ర

మహారాణిపేట: ఈనెల 12న నగరంలో హనుమాన్ శోభా యాత్ర, భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ ర్యాలీ కోసం హనుమాన్ విజయోత్సవ కమిటీ ఆధ్వర్యంలో నగర పరిధిలో అయిదు ప్రాంతాల నుంచి ప్రణాళిక తయారు చేశారు. పెందుర్తి, గాజువాక, మారీట్ హోటల్, ఆనందపురం, పోస్టాఫీసు తదితర ప్రాంతాల గుండా సాగే ర్యాలీ సాయంత్రం 5 గంటలకు బీచ్ రోడ్డులో ఉన్న పార్క్ హోటల్‌కు చేరుతుంది. అక్కడి నుండి హనుమాన్ శోభాయాత్ర మొదలై కాళీమాత దేవాలయం వరకు సాగుతుంది.

పార్కింగ్‌కు మార్కింగ్



పూర్ణామార్కెట్ వద్ద మార్కింగ్ చేసిన స్థలంలో పార్కింగ్ చేసిన వాహనాలు

జగదాంబ: జీవీఎంసీ అధికారులు ఎట్టకేలకు పూర్ణామార్కెట్ వద్ద పార్కింగ్ కోసం మార్కింగ్ చేశారు. సీపీ పూర్ణామార్కెట్‌ను పరిశీలించి ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో జీవీఎంసీ రెవెన్యూ అధికారులు పార్కింగ్ కోసం శుక్రవారం రాత్రి మార్కింగ్ చేశారు. ఈ ప్రాంతంలో ఎటువంటి ఆక్రమణలు జరగకుండా, రహదారిపై దుకాణాలు పెట్టకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు జీవీఎంసీ రెవెన్యూ అధికారులు తెలిపారు. శనివారం ఉదయం నుంచి మార్కెట్‌కు వచ్చే వినియోగదారులు తమ వాహనాలు పార్కింగ్ స్థలంలో పెట్టుకుంటున్నారు.

రైతుబజార్ తనిఖీ



రైతుబజారులో టమాటాలను పరిశీలిస్తున్న డీటీఎం షేక్ యాసిన్

సీతమ్మధార: స్థానిక రైతు బజార్‌ను శనివారం జిల్లా వ్యవసాయ, వాణిజ్య మార్కెటింగ్ శాఖ అధికారి షేక్ యాసిన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న టమాటాలను పరిశీలించారు. ఒక రైతు వద్ద టమాలు బాగులేకపోవడంతో అధికారి రైతును హెచ్చరించారు. టమాటాలు విక్రయిస్తున్న కౌంటర్లను, రైతుల ఐడీ కార్డులను పరిశీలించారు. వినియోగదారులకు ఇబ్బంది లేకుండా విక్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్టేట్ అధికారి కృష్ణమూర్తి, సహాయకుడు సతీష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ వైద్య శిబిరానికి విశేష స్పందన



పరీక్షలు నిర్వహిస్తున్న వి హెల్త్‌కేర్, వి డెంటల్ కేర్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: బెస్ట్ ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వి హెల్త్ కేర్, వి డెంటల్ కేర్ సహకారంతో శనివారం రైల్వే గ్రౌండ్స్‌లో నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వి హెల్త్ కేర్ డైరెక్టర్ కేఎంకే రమేష్ వాకర్లకు ఆరోగ్య విషయంలో పలు సూచనలు చేశారు. ఆరు నెలలకు ఒకసారి విధిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. నోటి పరిశుభ్రత, దంతాల అమరిక సరైన రీతిలో ఉన్నవారికి బెస్ట్ స్మైల్ అవార్డులు ప్రదానం చేశారు. వి డెంటల్ కేర్ డెంటిస్ట్ డాక్టర్ వి. స్వర్ణలత, క్లినిక్ హెడ్ సీహెచ్ కృష్ణచైతన్య, సిబ్బంది లతీష, శైలజ తదితరులు పాల్గొన్నారు.

సీతా పరిణయ వేళాయె..



అంబికాబాగ్ సీతారామ లక్ష్మణ హనుమత్ విగ్రహాలు



పాతనగరంలో పూజలందుకుంటున్న సీతారామచంద్రస్వామి

అంబికాబాగ్‌కు కల్యాణ కాంతులు

సీతారామ చంద్రాలయంలో నవమి వేడుకలు

నేడు కల్యాణం.. రేపు పట్టాభిషేకం

డాబాగార్డెన్స్: లోకాభిరాముడు శ్రీరాముడు జనకసుత జానకిని పరిణయమాడే సుముహూర్తం సమీపించడంతో జగదాంబ జంక్షన్ సమీపాన మహారాణిపేట అంబికాబాగ్ రామాలయంలో కల్యాణ ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 7 వరకు సీతారాముల కల్యాణ మహోత్సవాలు కనులపండువగా జరగనున్నాయి.

ఆజానుబాహుడే..

సాధారణంగా రాముని విగ్రహాలు అంత ఎత్తు ఉండవు. కానీ అంబికాబాగ్ ఆలయంలోని రాముని విగ్రహం మాత్రం 6 అడుగుల 3 అంగుళాల ఎత్తున సుందరంగా మలిచారు శిల్పులు. సీతా లక్ష్మణుల రాతి విగ్రహాలను 5 అడుగుల 9 అంగుళాల ఎత్తులో, 3 1/2 అడుగుల ఎత్తులో ఉత్సవ మూర్తులను రూపొందించారు. రామభక్త హనుమాన్ కూడా కొలువుదీరారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి రప్పించిన ఈ విగ్రహాలను 2013 మే 4న ప్రతిష్ఠించారు.

అత్యంత వైభవంగా నిర్వహించనున్నాం..

అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. శనివారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లు పరిశీలించారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సీతారామ స్వామికి కల్యాణం నిర్వహించడంతో పాటు అదే రోజు ఉదయం 5 నుంచి అభిషేకాలు, హోమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. కల్యాణోత్సవం అనంతరం ఐదు వేల మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నట్టు వెల్లడించారు.

ఆలయ చరిత్ర ఇదీ..

చెముడు ఎస్టేట్స్ వంశీయుల పట్టపు మహారాణి చంద్రమణీదేవి ఉన్నప్పుడు ఆమె నివసించే స్థలంలో (అంబికాబాగ్) శ్రీరాముడిని పూజించేవారట. సుమారు 2.70 ఎకరాల సువిశాల స్థలంలో రామ మందిరాన్ని నిర్మించి, అందులో శ్రీసీతారామచంద్ర లక్ష్మణ సమేత హనుమత్ దారు విగ్రహాలను ఉంచి నిత్య పూజాదికాలు కార్యక్రమాలు నిర్వహించేవారని చెబుతారు. వారిచే నిర్మింపబడిన కల్యాణ మండపంలో ప్రతి సంవత్సరం కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తూ ఉండేవారు. ఆమె తదనంతరం ఆ స్థలంలో రామాలయం నిర్మించాలన్నదే రాణి వారి చివరి కోరిక. అది ఇన్నాళ్లకు నెరవేరుతోంది. ఆ స్థలంలో భద్రాద్రి ఆలయం వలె గ్రానైట్‌తో సీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణానికి 2001 జూన్ 20న భూమిపూజ చేశారు. దేవస్థానాన్ని నగరంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం దత్తత తీసుకుంది. నిర్వహణను దేవస్థానమే చూస్తోంది.

అతి ప్రాచీన రామాలయం చరిత్ర..

నగరంలోని పాతనగరంలో అతి ప్రాచీన దేవాలయంగా పేరు గాంచిన సీతారామస్వామి దేవాలయం 1540 నాటిదని ఆధారాలు ఉన్నాయి. దేశంలో ఎక్కడా లేని విధంగా సాలగ్రామ శిలలుతో ఉన్న లక్ష్మణ సమేత సీతారామ స్వామిని ఇక్కడ ప్రతిష్ఠించారు. స్వామి విగ్రహ ప్రతిష్ఠ జరిగే నాటికి నగరంలో ఒకే ఒక్క దేవాలయం ఉండేదని, అది శ్రీవైశాఖేశ్వరుని దేవాలయంగా చెబుతారు. కాలక్రమేణా ఆ దేవాలయం సముద్రగర్భంలో కలిసిపోవడం వల్ల ప్రస్తుతం నగరంలో ఇదే తొలి దేవాలయంగా పేరు గాంచినట్టు పూర్వీకుల కథనం. స్వామి వారి చరిత్రలోకి వెళ్తే దేవాలయం వ్యవస్థాపకులు పూర్వం సముద్ర వ్యాపారం చేస్తుండగా, ఒకసారి కేరళ సముద్రంలో లంగరు వేయగా అక్కడ సీతారాముల విగ్రహాలు దొరికాయని, వెంటనే వారు ఆ విగ్రహాలను తీసుకు వచ్చి అప్పట్లో ప్రధాన జంక్షన్.. ప్రస్తుతం దేవాలయం ఉన్న ప్రాంతంలో గుడి నిర్మాణానికి ఏర్పాట్లు చేసినట్టు చెబుతారు. స్వామి విగ్రహాలు ఎక్కడైతే దొరికాయో అక్కడే లక్ష్మణ విగ్రహం కూడా ఉంటుందని చెప్పడం, ఆ విగ్రహాన్ని కూడా తీసుకువచ్చి ప్రతిష్ఠ చెయ్యమని అంతర్ధానమయ్యారని చెబుతారు.



ముస్తాబైన అల్లిపురం కుమ్మరి వీధి రామాలయం

రాములోరి పెళ్లికి సర్వం సిద్ధం..

అల్లిపురం: శ్రీరామ నవమి సందర్భంగా వాడవాడలా ఆలయాలు సీతారాముల కల్యాణానికి ముస్తాబయ్యాయి. అల్లిపురం మెయిన్‌రోడ్డులో గల శ్రీ రామాలయం, బల్లిగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానం దత్తత దేవాలయం కోదండ రామాలయం, బంగారుమెట్ట, శ్రీ రామ ఆంధ్ర యువజన సమాజం, గోవింద్‌రోడ్డులో గల రాంరాం మందిరం అందంగా ముస్తాబయ్యాయి. మహిళలు సీతారాముల కల్యాణం విందుకు పూర్ణం బూర్లు తయారు చేస్తూ బంగారుమెట్టలో సందడి చేశారు.



బంగారుమెట్టలో శ్రీ రామ ఆంధ్ర యువజన సమాజం ఆధ్వర్యంలో శ్రీరామ నవమి ఏర్పాట్లు



సీతారాముల కల్యాణం విందుకు పూర్ణాలు తయారు చేస్తున్న బంగారుమెట్ట మహిళలు

నియోజకవర్గమంతా పండగే..

సీతారాముల పెళ్లికి నియోజకవర్గంలో గల రామాలయాలు సిద్ధమయ్యాయి. ప్రకాశరావుపేట రామాలయం, రామజోగిపేట శ్రీరామలింగేశ్వరాలయం, పోలీస్ బ్యారెక్స్‌లో గల ఉమా రామలింగేశ్వరాలయం, ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి వద్ద గల పురాతన సీతారామచంద్రస్వామి ఆలయం, చెంగల్రావుపేట రామాలయం, రెల్లివీధి రామాలయం, కోటవీధి రామాలయం, పెరికివీధి రామాలయం, గొల్లలపాలెం ఉమా రామలింగేశ్వరాలయంతో పాటు పాత నగరంలో గల పలు రామాలయాల్లో శ్రీరామ నవమి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు.

రాములవారికి ముత్యాలు బహూకరణ..

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దత్తత దేవాలయం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఆదివారం నిర్వహించనున్న స్వామి కల్యాణానికి ఉపయోగించే ముత్యాల తలంబ్రాలను ఆంధ్రప్రదేశ్ ప్రాదేశిక్ మార్వారి సమ్మేళన్ రాష్ట్ర కార్యదర్శి పోదేశ్వర్ పురోహిత్ దంపతులు ఆలయ ఈవో కె. శోభారాణికి విరాళంగా శనివారం అందజేశారు. కార్యక్రమంలో ఏఈవో తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సీతారామచంద్రస్వామికి ముత్యాల తలంబ్రాలు అందజేస్తున్న పోదేశ్వర్ పురోహిత్ దంపతులు

ఉత్సాహంగా వీడ్కోలు వేడుకలు



విజేతలతో డాక్టర్ సిస్టర్ షైజీ, జయలక్ష్మి



మాట్లాడుతున్న మనోరంజని

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన వీడ్కోలు వేడుకలు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ నేతృత్వంలో ఉత్సాహంగా జరిగాయి. ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన విద్యార్థినులకు ఘనంగా వీడ్కోలు పలికారు. ముఖ్య అతిథిగా భీమునిపట్నం రెవెన్యూ డివిజన్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఆలిస్ మనోరంజని పాల్గొని మాట్లాడారు. అమ్మాయిల్లో విజ్ఞానం సమాజాభివృద్ధికి దోహద పడుతుందన్నారు. కళాశాలను వీడిన తర్వాత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. మానవ విలువల ఆవశ్యకతతో పాటు ఈ పోటీ యుగంలో అన్ని రంగాల్లో మహిళలు ముందుకు వెళ్లాల్సిన అవసరాన్ని అందరూ గుర్తుంచుకోవాలన్నారు. పరీక్షా సమయంలో చదువులకు ప్రాముఖ్యత ఇవ్వాలని కోరారు. వివిధ గ్రూపుల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు, డాక్టరేట్ సాధించిన లెక్చరర్లను ఘనంగా సత్కరించారు. విద్యార్థినులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అహూతులను ఆకట్టుకున్నాయి. మిస్ సెయింట్ జోసెఫ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థినులను సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ హేమ, డాక్టర్ పి.కె.జయలక్ష్మి, డాక్టర్ ఇ. హరిణి, రమణిలత, పావని, డాక్టర్ ప్రవీణ్, పవన్, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ జైల్‌లో చలివేంద్రం ప్రారంభం



ములాఖత్ కోసం వెళ్లిన వారికి తాగునీరు అందిస్తున్న జైల్ అధికారులు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో వేసవి రక్షణ చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఖైదీలను కలవడానికి వెళ్లే వారి కోసం శనివారం జైల్ ఆవరణలో ములాఖత్ హాల్ ముందు చలివేంద్రం ప్రారంభించారు. ములాఖత్ కోసం వెళ్లిన వారికి జైల్ సూపరింటెండెంట్ ఎం.మహేష్‌బాబు సూచనలతో డిప్యూటీ సూపరింటెండెంట్లు జవహర్‌బాబు, సాయిప్రవీణ్, జైలర్లు, సిబ్బంది తాగునీరు అందించారు. చల్లదనం కోసం వడకట్టిన నీటిని మట్టి కుండల్లో నిల్వ ఉంచి పంపిణీ చేస్తున్నారు. వేసవి నుండి ఉపశమనానికి జైల్ లోపల ఖైదీలకు శుక్రవారం మజ్జిక పంపిణీ కార్యక్రమం ప్రారంభించిన విషయం తెలిసిందే.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

అల్లిపురం: స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త బాబూ జగ్జీవన్‌రామ్ 118వ జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ 34వ వార్డు పరిధి కొబ్బరితోటలో నూకాంబిక సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మొయేటి అప్పారావు, యానంగి వేణు, చెవ్వేటి అప్పారావు, దిగుమర్తి ప్రసాద్, రాయి అప్పారావు, తెలుగుచర్ల కనకరాజు, రాయి చిన్న, తెలుగుచర్ల శ్రీను, యాణంగి శివకుమార్ తదితరులు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న నూకాంబిక సేవా సంఘం ప్రతినిధులు

పదోన్నతి కల్పించాలని వినతి

అల్లిపురం: వార్డు ఎడ్యుకేషనల్ సెక్రటరీలకు ప్రమోషన్ కల్పించి, సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సచివాలయ విద్యా కార్యదర్శులు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను కోరారు. ఈ మేరకు వారు శనివారం అతన్ని టీడీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు విద్యా కార్యదర్శులకు మెరుగైన బేసిక్ పేతో, ప్రమోషన్ కల్పించాలని, ఇంక్రిమెంట్లు తదితర సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వల్లా కిరణ్‌కుమార్ యాదవ్, నాయకులు మొకర శ్రావణ్‌కుమార్, కొలిమెల్ల సురేష్‌కుమార్, రాజా, బంగారునాయుడు, హరి, అబ్దుల్ ఖాసీం తదితరులు పాల్గొన్నారు.



పల్లా శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న కిరణ్‌కుమార్ యాదవ్ తదితరులు

సిబ్బంది సంక్షేమానికే ప్రాధాన్యం

పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి

అల్లిపురం: సిబ్బంది సంక్షేమానికి ఎల్లప్పుడు ప్రాధాన్యం ఉంటుందని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. శనివారం ఆయన హెల్త్ ఇన్సూరెన్స్ కవరేజ్‌పై పోలీస్ సిబ్బందితో పాటు పలు హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పోలీసు కుటుంబానికి మెడికల్ భద్రత అవసరమన్నారు. ఈ నెల 30లోగా వంద శాతం హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకోవాలని, అందుకు 24/7 ఇన్సూరెన్స్ సెల్ పని చేస్తుందని తెలిపారు. ఈ సెల్ ద్వారా ఆస్పత్రికి వెళ్లినప్పుడు పేషెంట్‌ను చూసుకుంటే సరిపోతుందన్నారు. ఇన్సూరెన్స్ క్లెయిమ్ పోలీస్ ఇన్సూరెన్స్ సెల్ చూసుకుంటుందన్నారు. అవసరం మేరకు నగర పోలీస్ శాఖ వెల్ఫేర్ ఫండ్ నుంచి కూడా నగదు విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కుటుంబ సభ్యులతో చర్చించిన అనంతరం మీకు ఉపయోగపడే ప్లాన్ తీసుకోమని తెలిపారు.

సదరం కోసం పడిగాపులు

మహారాణిపేట: సదరం స్లాట్ బుకింగ్ చుక్కలు చూపిస్తోంది. ఇటీవల ప్రభుత్వం సదరం స్లాట్ సిద్ధంగా ఉంటుందని ప్రకటన జారీ చేసింది. దీంతో పలువురు దివ్యాంగులు, ఇతరులు సచివాలయాలకు చేరుకున్నారు. అయితే ఎక్కడా సదరం స్లాట్ ఓపెన్ కాలేదు. సర్వర్ల సమస్య అంటూ సచివాలయ అడ్మిన్లు, ఇతర సిబ్బంది చెప్పుకొచ్చారు. శుక్ర, శనివారం సదరం స్లాట్ ఎవరికీ అందుబాటులో లేకుండా పోయింది. ఉదయం పది గంటలు దాటినా ఎక్కడ సర్వర్ అందుబాటులోకి రాలేదు. దీంతో దివ్యాంగులు తదితరులు సచివాలయ కేంద్రాల వద్ద మధ్యాహ్నం 12 గంటల వరకు పడిగాపులు కాశారు.

రాజ్యాంగం ప్రాముఖ్యత ఎనలేనిది

డాబాగార్డెన్స్: రాజ్యాంగం ప్రతి రోజూ మన జీవితాల్లో ప్రాముఖ్యత కలిగి ఉందని సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఎస్‌సీజెడ్ఐఈఎఫ్) సంయుక్త కార్యదర్శి జి. కిషోర్‌కుమార్ పేర్కొన్నారు. జ్యోతిబా పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని శనివారం ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ విశాఖ డివిజన్ నేతృత్వంలో డివిజనల్ కార్యాలయ ప్రాంగణంలో 'భారత రాజ్యాంగం-జీవించే వారి పత్రం'అనే అంశంపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నేతృత్వంలోని డ్రాఫ్టింగ్ కమిటీ తీసుకున్న అంశాలను వివరించారు. రాజ్యాంగం మనకు ప్రసంగ స్వాతంత్ర్యం, మతాన్ని ఆచరించుకునే స్వేచ్ఛ, యూనియన్లు ఏర్పరచుకునే హక్కులు, సమానత్వాన్ని కలిగిస్తుందన్నారు. ప్రస్తుత పాలకుల విధానం రాజ్యాంగ ఆత్మకు విరుద్ధంగా ఉందని, గాజా యుద్ధాన్ని అనుకూలిస్తూ ఓటు వేయడం ద్వారా దేశ సార్వభౌమత్వానికి రాజీ పడ్డారని విమర్శించారు. ఐసీఈయూ అధ్యక్షురాలు ఎం. కామేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో డాక్టర్ కళాధర్, బి. గణపతిరాము, బి. శ్రీనివాసరావు, సూర్యప్రభ, జి. వరప్రసాదరావు, మీడియా ఇన్‌చార్జి ఆచంట రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌సీజెడ్ఐఈఎఫ్ సంయుక్త కార్యదర్శి కిషోర్‌కుమార్

సీఆర్పీఎఫ్ జిల్లా నూతన కమిటీ ఏర్పాటు

సీతంపేట: బాలల హక్కుల పరిరక్షణ ఫెడరేషన్ (సీఆర్పీఎఫ్) జిల్లా నూతన కమిటీ ఏర్పాటైంది. రాష్ట్ర కన్వీనర్ సీహెచ్ విశాలాక్షి అధ్యక్షతన శుక్రవారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఈ సమావేశానికి జిల్లా సెషన్స్ మాజీ జడ్జి విజయసూర్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా నూతన కమిటీ సభ్యులు బాలల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా పని చేయాలని సూచించారు. బాలల హక్కుల కోసం రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలను సభికులకు వివరించారు. రాష్ట్ర బాలల హక్కుల కన్వీనర్ గొర్రెపల్లి దామోదర్ ఇన్‌స్టలేషన్ ఆఫీసర్‌గా వ్యవహరించి నూతన కమిటీకి సూచనలు, సలహాలు, విధివిధానాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ వి.సతీష్, జిల్లా ఎన్జీవోల సంఘం అధ్యక్షుడు ఎల్.ప్రజ్ఞాన్‌కుమార్, నూతన కమిటీ అధ్యక్షుడు మున్నీర్ బాషా, ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసమూర్తి, సలహాదారులు డాక్టర్ దుప్పలపూడి దీనబంధు, కార్యదర్శి రామలక్ష్మి, ఎస్.అనూరాధ, హసన్‌రాజు, రాజు తదితరులు పాల్గొన్నారు.



సీఆర్పీఎఫ్ నూతన కమిటీ సభ్యులతో జిల్లా సెషన్స్ మాజీ జడ్జి విజయసూర్య

సవరణ బిల్లుతో ముస్లింలకు తీవ్ర నష్టం

మద్దిపాలెం: పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిటన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుతో ముస్లింలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని విశాఖ జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు, 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ అన్నారు. ఈ మేరకు శనివారం పార్టీ వార్డు కార్యాలయంలో నియోజకవర్గం సమాచార హక్కు చట్టం అధ్యక్షుడు షేక్ బాబ్జీతో కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. వక్ఫ్‌బోర్డు ఆస్తులను రక్షించాలని, సవరణ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ముస్లింలను సమన్వయపరుస్తూ పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. షేక్ బాబ్జీ మాట్లాడుతూ సవరణ బిల్లు వల్ల ముస్లింలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. సమావేశంలో చేతికి నల్లరిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు.

దివ్యాంగ విద్యార్థుల నగర సందర్శన

ఏయూక్యాంపస్: విశాఖ నగరాన్ని శనివారం దివ్యాంగ విద్యార్థులు సందర్శించారు. హైదరాబాద్‌కు చెందిన 25 మంది విద్యార్థులు సీఐఐ-యంగ్ ఇండియన్(వైఐ) సహకారంతో విజ్ఞాన యాత్రకు నగరానికి వచ్చారు. వీరు ముందుగా హిందుస్తాన్ షిప్‌యార్డ్‌ని సందర్శించి నౌకల తయారీ విధానం తెలుసుకున్నారు. విభిన్న ప్రతిభావంతులు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఏ విధంగా రాణిస్తున్నారో వారికి ప్రత్యక్షంగా వివరించారు. అనంతరం వీరి బృందం బీచ్ రోడ్డులోని టీయూ 142 యుద్ధ విమానం, సీ హారియర్ మ్యూజియం, సబ్‌మెరైన్ మ్యూజియంలను సందర్శించారు. భారత నావికాదళం వారసత్వాన్ని, దేశ భద్రతలో బారత రక్షణ వ్యవస్థ పటిమను వారు అర్థం చేసుకునేలా విజ్ఞాన యాత్ర సాగింది. కార్యక్రమానికి వైఐ విశాఖపట్నం అక్సెలిబిలిటీ చైర్ రమీలా బండి నాయకత్వం వహించగా.. వైఐ సభ్యులు విరాట్ మహేశ్వరి, రోహిత్ కంచర్ల తదితరులు పాల్గొన్నారు.



సబ్‌మెరైన్ వద్ద హైదరాబాద్‌కు చెందిన దివ్యాంగ విద్యార్థులు